# గోగినేనిమణి రచనలు - పరిశీలన


పరిశోధకుడు

**లక్కరాజు అర్జునరావు**

ఎమ్.ఎ.

పర్యవేక్షకులు

**ఆచార్య జర్రా అప్పారావు**

ఎం.కాం., ఎం.ఎ., ఎం.ఫిల్., పిహెచ్.డి.

విభాగాధిపతి, తెలుగు శాఖ


**పిహెచ్.డి. పట్టా నిమిత్తం ఆంధ్ర విశ్వకళాపరిషత్‌కు సమర్పించిన సిద్ధాంత గ్రంథం**


**తెలుగు శాఖ, ఆంధ్ర విశ్వకళాపరిషత్**

**విశాఖపట్నం - 530 003.**

**2020**

# హామీపత్రం

**"గోగినేనిమణి రచనలు - పరిశీలన"** అనే ఈ సిద్ధాంత గ్రంథాన్ని నేను స్వయంగా రాసాననీ, దీన్ని ఏ ఇతర పట్టా కోసం కానీ, డిప్లమో కోసం కానీ, మరే ఇతర బిరుదు కోసం కానీ, ఇంతకుముందు ఏ విశ్వవిద్యాలయానికి కానీ, ఏ ఇతర సంస్థకు కానీ సమర్పించలేదని ప్రకటిస్తున్నాను.

**(లక్కరాజు అర్జునరావు)**

**పరిశోధకుడు**

# ధ్రువీకరణ పత్రం

**"గోగినేనిమణి రచనలు - పరిశీలన"** అనే ఈ సిద్ధాంత గ్రంథాన్ని "శ్రీ లక్కరాజు అర్జునరావు" నా పర్యవేక్షణలో రాశారనీ ఈ పరిశోధన అతని స్వయంకృషి అని ధ్రువీకరిస్తున్నాను.

**(ఆచార్య జర్రా అప్పారావు)**

**పర్యవేక్షకులు**

# విషయ సూచిక


కృతజ్ఞతలు - i

ముందుమాట - ii - iii

❖ మొదటి అధ్యాయం - 1 - 21

**గోగినేని మణి - జీవిత విశేషాలు**

**1.1** కుటుంబ నేపథ్యం

**1.2** రచనల పరిచయం

**1.3** గోగినేని మణి కథలు చారిత్రక నేపథ్యం

**1.4** నవలా రచయిత్రిగా గోగినేని మణి

**1.5** అవార్డులు - రివార్డులు

❖ రెండో అధ్యాయం - 22 - 130

**గోగినేని మణి కథలు విశ్లేషణ**

**2.1** కుటుంబ జీవన కథలు

**2.2** ప్రణయ సంబంధ కథలు

**2.3** మానవీయ విలువలకు సంబంధించిన కథలు

**2.4** స్త్రీలకు సంబంధించిన కథలు

❖ మూడో అధ్యాయం - 131 - 180

**సుజన నవల - విశ్లేషణ**

**3.1** ఉపోద్ఘాతం

**3.2** వస్తువు

**3.3** సుజన నవల - విశ్లేషణ

**3.4** సుజన నవల - పాత్ర చిత్రణ

**3.5** సంభాషణలు

**3.6** సుజన నవల - సామాజిక చైతన్యం

❖ నాలుగో అధ్యాయం - 181 - 238

**గోగినేని మణి రచనలు - శిల్పం**

**4.1** పాత్ర చిత్రణ

**4.1.1** కరుణరస స్వభావం గల పాత్రలు

**4.1.2** సందేశాత్మక పాత్రలు

4.2 శీర్షికలు
4.2.1 పాత్రపేరు ప్రాధాన్యంగా వచ్చిన శీర్షికలు
4.2.2 విషయ ప్రాధాన్యత గల శీర్షికలు
4.2.3 సంఘటనాత్మక శీర్షికలు
4.3 కథాకథన శిల్పం
4.3.1 పరాశ్రయ పద్ధతి
4.3.2 ఆత్మాశ్రయ పద్ధతి
4.3.3 లేఖా పద్ధతి
4.4 ఎత్తుగడ
4.4.1 నాటకీయ ఆరంభం
4.4.2 ఆరంభిక చిత్ర విధానం
4.4.3 కుతూహలపూర్ణ ఆరంభం
4.4.4 ఇతివృత్తాత్మక ఆరంభం
4.4.5 హాస్యముతో కూడుకున్న ఎత్తుగడ
4.5 నడక
4.6 ముగింపు

❖ ఐదో అధ్యాయం - 239 - 298
**గోగినేనిమణి రచనా విశేషాంశాలు**
5.1 భాష
5.2 శైలి
5.3 సంభాషణలు
5.4 ఇతివృత్త స్వీకారం
5.5 వర్ణనలు
5.6 నూతన పదబంధాలు
5.7 సామెతలు
5.8 సన్నివేశ కల్పన
5.9 కవితాత్మక వర్గీకరణ
5.10 తిట్లు, శాపనార్థాలు

**ఉపసంహారం** - 299
**అనుబంధం** - 300 - 306
**ఉపయుక్త గ్రంథ సూచి** - 307 - 311

# కృతజ్ఞతలు

నా జన్మకారకులైన నాతల్లిదండ్రులు, దైవసమానులు **శ్రీ లక్కరాజు కన్నయ్య, శ్రీమతి అర్జునమ్మ** గార్ల పాదాలకు ముందుగా నమస్కారాలు. "గోగినేనిమణి రచనలు – పరిశీలన" అనే అంశాన్ని పరిశోధనకు ఎంచుకోవడానికి మార్గనిర్దేశనం చేసి, పర్యవేక్షణ బాధ్యత వహించి సకాలంలో నా పరిశోధననూ నేను పూర్తి చేయడానికి అన్ని విధాల సహాయ సహకారాలు అందించిన సహృదయ సంపన్నులు, విద్యార్థి హృదయవాసులు, మా గురువర్యులు **ఆచార్య జర్రా అప్పారావు** గారికి నాహృదయపూర్వక ధన్యవాదాలు.

ఈ సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించడానికి అన్ని విధాల సహాయ సహకారాలు అందించిన పర్యవేక్షకులూ, తెలుగుశాఖాధిపతి **ఆచార్య జర్రా అప్పారావు** గారికీ, **ఆచార్య గజ్జా యోహాన్ బాబు** గారికీ, విశ్రాంత ఆచార్యులు **కె. సుదర్శన్ రాజు** గారికీ, **సజ్జా మోహన్ రావు** గారికీ, **వెలమల సిమ్మన్న** గారికీ, **ఎం. దత్తాత్రేయ శాస్త్రి** గారికీ మరియు **ఎం. జయదేవ్** గారికీ ప్రత్యేక ధన్యవాదాలు.

అడిగిన వెంటనే తమ కథా సంపుటాలను, నవలను, పత్రికా ప్రచురణలను ఇవ్వడమే కాకుండా ఓపికతో అనేక సందేహాలకు సమాధానాలందించిన **శ్రీమతి గోగినేనిమణి** గారికి మరియు **వారి కుటుంబ సభ్యులకూ** ధన్యవాదములు.

నా సిద్ధాంత గ్రంథాన్ని సకాలంలో అందంగా డి.టి.పి. చేసి ఇచ్చిన **"నాయుడు డి.టి.పి., మద్దిలపాలెం"** అధినేత శ్రీ కనకల అయ్యప్ప గారికీ,

ఇంకా నా పరిశోధన పూర్తి కావడానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రోత్సహించి, నాకు అడుగడుగునా సహాయ సహకారాలందించిన మిత్రులు **డా॥ శ్రీహరి సాహు, డా॥ అల్లు గణేష్, రమణ, లక్ష్మణ్, కీర్తన**, హితులు, సన్నిహితులెందరో ఉన్నారు. వారందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు.

**(లక్కరాజు అర్జునరావు)**

**పరిశోధకుడు**

# ముందుమాట

"The Fool doth think he is wise, but the wise man knows himself to be a fool."

మూర్ఖులు వివేకవంతులుగా భావిస్తారు. కాని వివేకవంతులు తాము మూర్ఖులమనే భావనతో ఉంటారు అన్న విలియం షేక్స్పియర్ మాటలు ఉత్తమ రచయిత్రి, కథకురాలు అయిన శ్రీమతి గోగినేనిమణి విషయంలో అక్షరసత్యాలు. ఆధునిక తెలుగు సాహిత్యంలో గొప్ప ప్రతిభావంతురాలైన రచయిత్రి గోగినేనిమణి. కాని ఆమె సున్నితమైన మనస్సు ప్రశంసలు, పురష్కారాలకు పొంగిపోర్లదు. విమర్శకు కృంగిపోదు. ఆమె రచనలలోని చక్కటిశైలిపాఠకుడిని రచనలపట్ల మంత్రముగ్ధున్ని చేస్తుంది. ఓ ప్రవాహంలా పదాల పొందిక కలిగి ఉండి, పాఠకుడికి అయోమయ పరిస్థితిని కలిగించకుండా సూటిగా చెప్పగలిగే సమర్ధత గోగినేనిమణి సొంతం. కావునే ఆమె ప్రతి రచన విలువైన మణే.

సమకాలీన జీవితాన్ని వివిధ కోణాల్లో పరిశీలించి, సమకాలీన సమస్యలను తన రచనావస్తువులుగా తీసుకొని చక్కటి కథలుగా మలిచారు. కథల యొక్క ఎత్తుగడ, నడక, ముగింపు, శిల్పం, పాత్రచిత్రణ, సన్నివేశ కల్పన పాఠకుడిని ఆకట్టుకుంటాయి. ఈమె కథలు వివిధ ప్రముఖ మాస, వార, దిన పత్రికలలో ప్రచురించబడ్డాయి. వీటిలో చాలా కథలు ప్రముఖుల ప్రశంసలు పొందినవి, బహుమతులు అందుకున్నాయి.

వాస్తవిక జీవనచిత్రాన్ని విడమరచి స్పష్టంగా ఒక దృశ్యాన్ని చూపినట్టుగా రచనలు చేయడం ఈమె ప్రత్యేకత. తన చుట్టూ ఉన్న జీవితాలను సునిశితంగా పరిశీలించి, ఆ జీవితాల ఆవేదనలను, కోరికలను, లక్ష్యాలను తమ కథల పాత్రలద్వారా సమాజానికి తెలియజేసే ప్రయత్నం చేశారు. మధ్యతరగతి కుటుంబ జీవనంలోని సమస్యలు, భార్యాభర్తల మధ్య గిల్లికజ్జాలు, యువతీయువకుల ప్రేమ సంఘర్షణలు ఒక్కటేమిటి ఒక సమాజంలో ఉండే అనేక అంశాల సమూహారంగా ఈమె కథాసంపుటాలు నిలిచాయి. ఈ కథలు చదువుతుంటే ఆ కథల్లో ఎక్కడో ఒకచోట తాను అనుభవించిన సంఘటనలు గుర్తుకురాకమానవు. సాహిత్యంలో సామాజికతను ప్రతిఫలింపజేయడంలో అందెవేసిన చేయి. గోగినేనిమణి గారిది. ప్రజాజీవితాన్ని విశిష్టమైన రీతిలో తన రచనల ద్వారా అందజేశారు. సంక్లిష్టమైన జీవిత సంబంధాలు, ఆర్ధిక సమస్యలు, మూఢనమ్మకాలు, చెడు వ్యసనాలు ఈమె కథలలో మనకు తారసపడతాయి.

గోగినేనిమణి వెలువరించిన నాలుగు కథాసంపుటాలను, నవలను క్షుణ్ణంగా అధ్యాయనం చేయడం వలన ఈమె రచనల పట్ల పరిశోధన చేయాలనే ఆసక్తి కలిగి మా పర్యవేక్షకుల అనుమతితో నావంతు ప్రయత్నం చేసాను.

"గోగినేనిమణి రచనలు-పరిశీలన" అను పరిశోధనాంశమును తీసుకొని పరిశోధనా సౌలభ్యం నిమిత్తం అయిదు అధ్యాయాలుగా విభజించాను.

మొదటి అధ్యాయంలో గోగినేనిమణి జీవిత విశేషాలను తెలియజేసాను. కుటుంబ నేపథ్యం, రచనల చారిత్రక నేపథ్యం, ఆమె పొందిన పురస్కారాలు, ఆమె కథలను ప్రచురించిన పత్రికలు, ప్రముఖుల అభిప్రాయాలు పరిచయం చేసాను.

రెండవ అధ్యాయంలో గోగినేనిమణి కథలను వర్గీకరించి విశ్లేషించాను. కుటుంబ జీవన కథలు, ప్రణయ సంబంధ కథలు, మానవీయ విలువలకు సంబంధించిన కథలు, స్త్రీలకు సంబంధించిన కథలుగా విభజించి, విశ్లేషించాను.

మూడవ అధ్యాయంలో గోగినేనిమణి సుజన నవలను విశ్లేషించాను. వస్తువు, నవలా విశ్లేషణ, పాత్రచిత్రణ, సంభాషణలు, సామాజిక చైతన్యం మొదలైన అంశాలను విశ్లేషించాను.

నాలుగవ అధ్యాయంలో గోగినేనిమణి రచనా శిల్పమును పరిచయం చేశాను. పాత్రచిత్రణ, శీర్షికలు, కథాకథన శిల్పం, ఎత్తుగడ, నడక, ముగింపు మొదలగు అంశాలను పరిచయం చేశాను.

అయిదవ అధ్యాయంలో గోగినేనిమణి రచనలలో భాషావిశేషాంశాలను పొందుపరిచాను. భాష, శైలి, సంభాషణలు, ఇతివృత్త స్వీకరం, వర్ణనలు, నూతన పదబంధాలు, సామెతలు, సన్నివేశ కల్పన, కవితాత్మక వర్గీకరణ, తిట్లు-శాపనార్థాలు మొదలైన విశేషాంశాలను పొందుపరిచాను.

చివరిగా ఉపసంహారంలో గోగినేనిమణి రచనలపై నా అభిప్రాయాన్ని వ్యక్తపరిచాను. అనుబంధంలో ముఖాముఖి, కొన్ని చిత్రాలను జోడించాను. సిద్ధాంత గ్రంథ రచనకు నేను పరిశీలించిన గ్రంథాలను ఉపయుక్త గ్రంథసూచిలో అకారాది క్రమంలో తెలియజేశాను.

ఇలా నాప్రాంత రచయిత్రి రచనలను సిద్ధాంతీకరించడంలో నాకు అనంతమైన సంతృప్తి కలిగింది.

ఇట్లు

**లక్కరాజు అర్జునరావు**

# మొదటి అధ్యాయం

## గోగినేనిమణి – జీవిత విశేషాలు

# 1. గోగినేని మణి – జీవిత విశేషాలు

## ఉపోద్ఘాతం :

సమాజం పట్ల బాధ్యతతో కూడిన కథలను రచించిన కథకురాలిగా తనదైన ఒక ప్రత్యేక ముద్రను సంపాదించుకున్న కథా రచయిత్రి గోగినేని మణి. ఈమె రచనలు సమాజానికి అద్దం పట్టేవిగా కనిపిస్తాయి. సమాజం సాహిత్యానికి దేనినైతే అందిస్తుందో, సాహిత్యం తిరిగి సమాజానికి దాన్నే అందిస్తుంది. అందుకే సమాజానికి సాహిత్యానికి విడదీయరాని సంబంధం ఉంటుంది. అందుకే రచయితలకు సమాజానికి విడదీయరాని సంబంధం ఉంటుందని తెలుస్తోంది. సామాజిక చిత్రణ, సాంఘిక నేపథ్యం, మానవీయ విలువలు, సంఘసంస్కరణ దృక్పథం, స్నేహ సామరస్య సంఘీభావనా విధానం వీరి కథల్లో ప్రాధాన్యత సంపాదించుకున్నాయి. అటువంటి కథా రచయిత్రి జీవన రేఖల్ని సంక్షిప్తంగానైనా తెలుసుకోవడం ఎంతైనా అవసరం.

## 1.1 కుటుంబ నేపథ్యం :

గోగినేని మణి తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో శ్రీమార్ని నరసన్న, శ్రీమతి సూర్యకాంతమ్మ దంపతులకు ఆరవ సంతానంగా జన్మించారు. ఈమె తండ్రి ఆ రోజుల్లోనే గ్రాడ్యుయేట్ చదవడంతో ప్రభుత్వ ఉద్యోగం వచ్చినా వద్దనుకొని, గాంధీ గారి అనుయాయులుగా మారి రాజకీయాలలో పాల్గొనేవారు. ఈయన డిస్ట్రిక్ట్ బోర్డ్ ప్రెసిడెంటు, జిల్లా పౌర గ్రంధాలయం ఛైర్మన్ వంటి ఎన్నో పదవులు నిర్వహించారు. నీతి నిజాయితీలకు మారుపేరుగా అందరూ అనుకునేవారు. ఇతను చివరి వరకూ ఖాదీ తప్ప మరొకటి ధరించలేదు.

తల్లి సూర్యకాంతమ్మ గృహిణి. ఆధ్యాత్మిక గ్రంధాలు ఎక్కువగా చదువుతూ ఉండేవారు. చదివి వినిపించమని తమ పిల్లలుకు పుస్తకాలు ఇచ్చి చదివించి, వారికి పుస్తక పఠనం పట్ల ఆసక్తి కలిగే విధంగా చేసేవారు. అందువలనే గోగినేని మణికి చిన్నతనం నుండీ పుస్తక పఠనమంటే మక్కువ ఎక్కువ అయింది. తల్లిదండ్రులంటే రచయిత్రికి అవ్యాజ్యమైన ప్రేమాభిమానాలు. తను రచించిన మనసున మల్లెలు కథల సంపుటిని తల్లిదండ్రుల స్మృతికి నివాళిగా అంకితం ఇచ్చారు.

గోగినేని మణికి ముగ్గురు అన్నయ్యలు, ఇద్దరు అక్కలు. పెద్దన్నయ్య రాంజీ ఎన్.సి.ఇ.ఆర్.టి.లో రీడరుగా చేసేవారు. అమెరికా, సోమాలియా, నేపాల్ వంటి దేశాలలో విజిటింగ్ ప్రొఫెసరుగా కొన్ని సంవత్సరాలు పని చేశారు. ఈయన రాసిన కొన్ని గ్రంథాలు నేపాల్‌లోని విద్యాసంస్థల్లో పాఠ్యాంశాలుగా కూడా పెట్టారు. రెండో అన్నయ్య విద్యాసాగర్ పాపాజీరావు విశాఖపట్నంలో కాల్టెక్సులో ఇంజనీరుగా పని చేస్తూ, వర్కర్స్ యూనియన్ తరుపున పోరాటం చేసి, తన ఉద్యోగానికి కూడా రాజీనామా చేశాడు. రాజమండ్రి వెళ్ళి అనేక సేవాసంస్థలకు తన సేవలందించాడు. మూడో అన్నయ్య గోపాలకృష్ణ అమెరికాలో ఇల్లినాయిస్‌లో అడ్మినిస్ట్రేటరుగా ప్రభుత్వ ఉద్యోగం చేసి, రిటైర్‌మెంటు తర్వాత రాజమండ్రిలో విశ్రాంత జీవనం సాగిస్తున్నారు. పెద్దక్క వరలక్ష్మిని బండారు రామకృష్ణకు ఇచ్చి వివాహం చేశారు. రామకృష్ణ తిరుపతి మెడికల్ కాలేజీలో జువాలజీ ప్రొఫెసరుగా పని చేశారు. చిన్నక్క సత్యవతికి గోలి ప్రభాకరరావుతో వివాహం జరిపించారు. ప్రభాకరరావు కొవ్వూరు షుగరు ఫ్యాక్టరీలో పని చేస్తారు.

రచయిత్రి చదువంతా రాజమండ్రిలోనే పూర్తయింది. బి.ఎస్సీ చదివింది. ఈమెకు గోగినేని సురేష్ బాబుతో 1970వ సంవత్సరంలో వివాహం జరిగింది. మామగారు శ్రీమన్నారాయణ గుంటూరు జిల్లా నిడుబ్రోలు కాలేజీలో ప్రిన్సిపాలుగా చేసేవారు. అత్తగారు లలితాంబ గృహిణి. సురేష్‌బాబు అగ్రికల్చర్ ఎమ్.ఎస్సీ చదివారు. ఈయన బాపట్ల కాలేజీలో రీసెర్చ్ డిపార్ట్‌మెంటులో ఒక సంవత్సరం పనిచేసి, తరువాత యూనియన్ బ్యాంకులో ఫీల్డ్ ఆఫీసరుగా ఉద్యోగం సంపాదించి, తన అత్యున్నత ప్రతిభతో తక్కువ కాలంలోనే బ్రాంచి మేనేజరు అయ్యారు. ఆ విధంగా ఎక్కువకాలం విశాఖపట్నంలో ఉండడం వలన ఎం.వి.పి. కాలనీలో స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నారు.

గోగినేని మణి కథలకు ప్రధమ పాఠకుడు, విమర్శకుడు తన భర్తేనని సగర్వంగా చెప్పుకుంటారు. భర్తమీద ప్రేమతో తన మొగలిపువ్వు కథల సంపుటిని ఆత్మీయంగా అంకితమిచ్చారు.

గోగినేని మణి, సురేష్‌బాబులకు ఇద్దరు పిల్లలు. కుమారుడు శ్రీనివాస్ ప్రస్తుతం చికాగోలో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పని చేస్తున్నాడు. కోడలు హిమబిందు. వీరికి ఇద్దరు పిల్లలు. కుమార్తె రాధిక హార్టికల్చర్ ఆఫీసరుగా విశాఖపట్నంలోనే విధులు నిర్వహిస్తుంది. అల్లుడు మురళీకృష్ణ స్టీలుప్లాంటులో డిప్యూటీ మేనేజరుగా చేస్తున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు.

## 1.2 రచనల పరిచయం :

గోగినేని మణి జీవన కథలను తొలిచూపు, మనసున మల్లెలు, మొగలిపువ్వు, పిచ్చుక గూడు పేరిట నాలుగు కథాసంపుటాలను వెలువరించారు. సుజన అనే ఒక నవలను కూడా రాశారు. ఈమె కథలు ఎన్నో పత్రికలలో ప్రచురిచబడ్డాయి. నేటికి ప్రచురించబడుచున్నాయి. ప్రముఖుల ప్రశంసలు అందుకుంటున్నాయి. ఈమె కథలు ఇతర భాషలలో కూడా అనువదించబడ్డాయి. హోగళ సేతువే (పూల వంతెన) పేరుతో కన్నడ భాషలో శ్రీ కస్తూరి (కె. చంద్రజ్యోతి) కొన్ని కథలను అనువదించారు. ఈమె కథలు కొన్ని కన్నడ పత్రికలలో కూడా ప్రచురించబడి అక్కడ కూడా పాఠకాదరణ పొందాయి. శ్రీసులోచన గారు కొన్ని కథలను కన్నడభాషలో కూడా అనువదించారని రచయిత్రి చెప్పగా తెలిసింది.

## 1.3 గోగినేని మణి కథలు చారిత్రక నేపథ్యం :

ఆధునిక తెలుగు కథ ప్రారంభమై శతాబ్దం గడిచింది. నాటి నుండి నేటి వరకు అనేక అంశాలను వస్తువుగా చేసుకుని తనదైన శైలితో అందరికి అర్థమయ్యే రీతిలో సరళమైన భాషను సొంతం చేసుకుని ఆధునిక వచన శైలిలో సంతరించుకొని నడవటమే. అందుకే కథ అందరిని ఆకట్టుకొంది, ఆకర్షిస్తుంది. జరిగిన, జరుగుతున్న, జరుగబోవు విషయాలను వస్తువుగా చేసుకుని కథ ప్రత్యక్షమవుతుంది. అందుకే కథలో నిత్యనూతనత్వం కనబడుతుంది. ఆధునిక వచన సాహిత్యంలో కథ ఒక ప్రక్రియగా నిలబడడానికి గల కారణం కథలో ఉన్న వస్తువు మాత్రమే. అతి చిన్న విషయాన్నైనా, విస్తృతమైన విషయాన్నైనా తనలో ఇముడ్చుకొని జన వ్యవహారంలో ఉన్న భాషను, భావనను కలుపుకొని ఆలోచనను, ఆనందాన్ని కల్గించే ప్రయత్నం చేసేది కేవలం కథ మాత్రమే. అటువంటి కథలు రాసిన ఎందరో మహానుభావులు తెలుగు సాహిత్యం చరిత్రలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకుని నేటికీ వారు లేకపోయినా ప్రజల నాలుకల మీద జీవిస్తున్నారు. తరాలు మారినా తరగని తెలుగు కథారచయితలు తెలుగు సాహిత్యంలో నేటికి రచనలు చేస్తూ, నూతన వైవిధ్యాన్ని ప్రదర్శిస్తూ, కథలకు కొత్త జీవాన్ని అందిస్తూ, తెలుగు కథా ప్రపంచాన్ని సుసంపన్నం చేస్తున్నారు. అటువంటి తెలుగు కథారచయిత్రులలో గోగినేని మణి ఒకరు. వీరు తన కథారచనను ప్రారంభించిన నాటి నుంచి నేటి వరకు అనేక కథలు రాస్తూనే ఉన్నారు. అది ఎప్పుడు ఎక్కడ ప్రచురించబడ్డాయో వాటి నేపథ్యాన్ని గూర్చి పరిశీలిద్దాం.

### 1.3.1 తొలిచూపు :

ఈ కథ 1987 ఏప్రిల్ నెల 3 నుంచి 9వ తేది మధ్యలో ఆంధ్రపత్రిక (వారపత్రిక)లో ప్రచురించబడింది. చక్కటి కుటుంబ సంబంధమైన నేపథ్యంతో సాగిందీ కథ.

### 1.3.2 పబ్లిసిటీ :

ఈ కథ 1987 ఆగష్టు 7 నుంచి 13వ తేది మధ్య ఆంధ్రపత్రిక (వారపత్రిక)లో ప్రచురించబడింది. సమాజంపై సినిమాల ప్రభావం ఏవిధంగా ఉంటుందో ఈ కథలో తెలియజేశారు రచయిత్రి. ద్వంద్వార్థాలతో కూడిన సంభాషణలతో తీస్తున్న నేటి సినిమాలను ఈ కథ ద్వారా వ్యంగ్యంగా చురకలంటించారు రచయిత్రి.

### 1.3.3 గెలుపు నాది :

ఈ కథ ప్రముఖవార పత్రిక ఆంధ్రపత్రికలో 1987 సెప్టెంబర్ 11 నుండి 17వ తేదీ మధ్య ప్రచురించబడింది. యుక్తవయసులో ఉండే యువతీయువకులు ఆలోచన ఏ విధంగా ఉంటుందో తెలియజేసే నేపథ్యంతో సాగుతుందీ కథ. చక్కటి వర్ణనతో కథను ప్రారంభించి కథనాన్ని నడిపించారు రచయిత్రి.

### 1.3.4 తానొకటి తలిస్తే :

ఈ కథ 1987 అక్టోబర్ నెల 9 నుంచి 15వ తేదీ మధ్య ఆంధ్రపత్రిక (వారపత్రిక) రెండవ సంచికలో ప్రచురించబడింది. సమకాలీన సమాజంలో అత్తా, కోడళ్ళ మధ్య జరిగే సంఘటనల ఇతివృత్తంగా సాగిందీ కథ.

### 1.3.5 స్వానుభవం :

ఈ కథ ఆంధ్రప్రభ పత్రికలో 1988 మార్చి 9న ప్రచురించబడింది. ఒక సాంఘిక ఇతివృత్తాన్ని తన స్వానుభవంగా చెప్పుకొచ్చారు ఈ కథలో రచయిత్రి.

### 1.3.6 వారసుడు :

ఈ కథ 1988 ఏప్రిల్ 18న ఆంధ్రప్రభ దిన పత్రిక ఆదివారం సంచికలో ప్రచురించబడింది. తన ఆస్తికే కాకుండా, ఆదర్శ భావాలకు కూడా వారసుడిని ఎన్నుకున్న ఒక పెద్ద మనిషి కథ వారసుడు. రచయిత్రి కథను నడిపించిన తీరు ఆకట్టుకుంటుంది.

**1.3.7 ఉపాయం :**

ఈ కథ ఆంధ్రజ్యోతి వారపత్రికలో సెప్టెంబర్ 9, 1988న ప్రచురించబడింది. ఉపాయంతో భర్తను దారిలోకి తెచ్చుకున్న భార్య కథ ఇది.

**1.3.8 నిప్పులేని పొగ :**

ఈ కథ 1988 నవంబర్ 4న ఆంధ్రపత్రిక (వారపత్రిక)లో ప్రచురించబడింది. ఈ కథ ఆంధ్రపత్రిక దీపావళి కథల పోటీలో బహుమతి పొందింది. నిజ జీవితంలోని సంఘటనలు కూడా కొన్ని నాటకీయంగా జరుగుతుంటాయని ఈ కథ ద్వారా సమాజానికి తెలియజేసే ప్రయత్నం చేసారు రచయిత్రి.

**1.3.9 అమ్మ కావాలి :**

ఈ కథ 1989 జనవరి 27న ఆంధ్రపత్రికలో ప్రచురించబడింది. తల్లిదండ్రుల లాలనలో అపూరూపంగా గడచిపోవాల్సిన బంగారు బాల్యాన్ని హాస్టల్ గదుల్లో తాకట్టు పెట్టే తల్లిదండ్రులకు హెచ్చరికగా ఈ కథ సాగింది.

**1.3.10 ఎన్నిక :**

ఈ కథ 1989 ఫిబ్రవరిలో వనిత మాసపత్రికలో ప్రచురించబడింది. కుటిల రాజకీయాలకు, సంతృప్తికరమైన జీవితానికి ఉండే తేడాను ఈ కథ ద్వారా వివరించే ప్రయత్నం చేసారు రచయిత్రి.

**1.3.11 అందం :**

ఈ కథ 1989 ఆగష్టు 6న ఈనాడు ఆదివారం సంచికలో ప్రచురించబడింది. శారీరక సౌందర్యం కంటే వ్యక్తిత్వసౌందర్యం గొప్పదని తెలియజేసే ప్రయత్నం చేసారు రచయిత్రి.

**1.3.12 అమ్మా! మన్నించవూ! :**

ఈ కథ 1989 సెప్టెంబర్‌లో స్వాతి మాసపత్రికలో ప్రచురించబడింది. భార్యమాటలను నమ్మి కన్నతల్లిని విస్మరించే కొడుకులకు మేలుకొలుపుగా ఈ కథ సాగుతుంది.

### 1.3.13 అంచనా :

ఈ కథ ప్రముఖ దినపత్రిక ఈనాడు ఆదివారం సంచిక ఫిబ్రవరి 4, 1990న ప్రచురించబడింది. సమాజంలో ఎవరిని తక్కువగా అంచనా వేయకూడదని ప్రతి ఒక్కరిలో లోపాలు, సుగుణాలు ఉంటాయని ఈ కథలో తెలియజేసారు రచయిత్రి.

### 1.3.14 కెనడా మామయ్య :

ఈ కథ 1990 జూన్ 17న ఈనాడు ఆదివారం అనుబంధంలో ప్రచురించబడింది. మానవ జీవితాన్ని ఆనందింపజేసేది మమకారం, ప్రేమానురాగాలేనని ఈ కథలో తెలియజేసారు రచయిత్రి.

### 1.3.15 అప్పు ఇచ్చి చూడు :

ఈ కథ ఈనాడు ఆదివారం అనుబంధం సెప్టెంబర్ 2, 1990న ప్రచురించబడింది. అప్పు ఇచ్చి ఆ బాకీని వసూలు చేయడంలో పడే అగచాట్లు ఏవిధంగా ఉంటాయో ఈ కథ ద్వారా సమాజాన్ని మేలుకొలిపారు రచయిత్రి.

### 1.3.16 ప్రేమ లేఖ :

ఈ కథ 1991 జనవరి 6న ఈనాడు ఆదివారం అనుబంధంలో ప్రచురించబడింది. భార్యాభర్తల మధ్య ప్రేమానురాగాలను చక్కటి కథారూపం ఇచ్చారు రచయిత్రి గోగినేని మణి.

### 1.3.17 మంచి గంధం :

ఈ కథ ఈనాడు ఆదివారం అనుబంధంలో 1992 అక్టోబర్ 11న ప్రచురించబడింది. మధ్యతరగతి కుటుంబంలో అవసరానికి మించి ఖర్చు చేయడం వలన జరిగే అనర్థాలు ఏవిధంగా ఉంటాయో ఈ కథలో తెలియజేసారు రచయిత్రి.

### 1.3.18 అతిథి దేవుడు :

ఈ కథ 1993 ఏప్రిల్ 18న ఈనాడు దినపత్రిక ఆదివారం అనుబంధంలో ప్రచురించబడింది. మధ్య తరగతి కుటుంబాల్లో అనుకోని అతిథులు రావడం వలన ఏర్పడే ఇబ్బందులను ఈ కథలో చక్కగా చూపించారు రచయిత్రి.

### 1.3.19 మనసున మల్లెలు :

ఈ కథ ఈనాడు దినపత్రిక ఆదివారం అనుబంధంలో 1994 జనవరి 30న ప్రచురించబడింది. భార్యాభర్తల మధ్య అన్యోన్య దాంపత్యం కంటే వారిద్దరి మధ్య ఇచ్చిపుచ్చుకునే కానుకలు గొప్పవి కావనే నేపథ్యంతో సాగిందీ కథ.

### 1.3.20 కలిసిన హృదయాలలోన :

ఈ కథ 1997 అక్టోబర్ 19న ఈనాడు ఆదివారం అనుబంధంలో ప్రచురించబడింది. తల్లిదండ్రులను ప్రేమగా, బాధ్యతగా చూసుకునే సంతానం కరువవుతున్న నేటి సమాజానికి మేలుకొలుపుగా ఈ కథను మలిచారు రచయిత్రి.

### 1.3.21 మిత్రమా... మన్నించు :

ఈ కథ ఈనాడు దినపత్రిక ఆదివారం అనుబంధంలో 2000, జనవరి 13న ప్రచురించబడింది. ఒకరికి సహాయపడడంలో ఉండే తృప్తి, ఆనందం వేరే దేనిలో ఉండదనే సందేశాత్మక నేపథ్యంతో ఈ కథ నడుస్తుంది. రచయిత్రి తన అనుభవాలను కాచి వడపోసి రాసిన కథ ఇది అని పాఠకునికి అన్పించకమానదు. సమాజానికి చక్కటి సందేశాన్నిచ్చిన నాడే రచయిత సఫలీకృతుడైనట్లు, గోగినేని మణి రచనలు నూటికి నూరుపాళ్ళు సమాజ సంక్షేమం కోసం రచించినవేనని ఈ కథ ద్వారా తెలుస్తుంది.

### 1.3.22 కొత్త అనుభూతి :

ఈ కథ 2000 మే 21న ఈనాడు దినపత్రిక ఆదివారం అనుబంధంలో ప్రచురించబడింది. ఉత్తరాలు రాయడం, చదవడం చాదస్తం అని భావించే నేటి తరానికి సందేశంగా ఈ కథను తీర్చిదిద్దారు రచయిత్రి. ఒక కొత్త నేపథ్యాన్ని తీసుకుని కథగా మలచడంలో గోగినేని మణి సిద్ధహస్తురాలు.

### 1.3.23 ఆచూపు :

ఈ కథ సెప్టెంబర్ 10, 2000న ఈనాడు ఆదివారం అనుబంధంలో ప్రచురించబడింది. కుటుంబ పరిస్థితి, ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తంగా మారిపోయేంతగా వ్యసనానికి బానిసయిన ఒక సగటు ఉద్యోగి కథే ఆ చూపు. రచయిత్రి తనదైన శైలిలో కథనాన్ని నడిపించారు.

### 1.3.24 నైన్... ఒన్... ఒన్ :

ఈ కథ స్వాతి వార పత్రికలో జనవరి 26, 2001న ప్రచురించబడింది. స్వాతి వారపత్రిక హాస్య కథల పోటీలో ప్రథమ బహుమతి పొందిన కథ ఇది. ఉద్యోగాలు చేసే తల్లిదండ్రులు తమ పిల్లల ఆలనాపాలనా చూడకుండా ఒంటరిగా వదిలేస్తున్నారు. ఆ ఒంటరితనాన్ని భరించలేని పిల్లలు ఆకతాయిలుగా మారిపోతున్నారు. ఈ అంశాన్నే నేపథ్యంగా తీసుకుని చక్కటి కథని అందించారు రచయిత్రి.

### 1.3.25 మమతల హారం :

ఈ కథ ఆంధ్రభూమి వారపత్రికలో మార్చి 8, 2001న ప్రచురించబడింది. పరంపరాగతంగా కొన్ని వస్తువులు ఒక తరం నుండి తర్వాతి తరం వారికి సంక్రమిస్తుంటాయి. ఆ వస్తువులపై అమితమైన అభిమానం కలిగి ఉంటారు. అటువంటి వస్తువులను కోల్పోయినపుడు పడే ఆవేదన ఇతరులకు తేలికగా అన్పించవచ్చు కానీ వారికి ఒక మధురస్మృతిని పోగొట్టుకున్నట్లు భావిస్తారు అనే చక్కటి నేపథ్యంతో ఈ కథ సాగింది.

### 1.3.26 బాంధవ్యాలు :

ఈ కథ ఆంధ్రప్రభ వారపత్రికలో మే 26, 2001న ప్రచురించబడింది. ఏ బాంధవ్యం శాశ్వతం కాదని కొన్ని ఎక్కువకాలం నిల్చి ఉంటే, కొన్ని తక్కువ కాలంలోనే సమసిపోతాయి అనే నేపథ్యంతో సాగిందీ కథ.

### 1.3.27 లెక్క తప్పింది :

ఈ కథ ఆంధ్రభూమి వారపత్రికలో ఫిబ్రవరి 7, 2002న ప్రచురించబడింది. భార్యాభర్తల మధ్య అర్థం చేసుకునే అన్యోన్యతానురాగాలుండాలే కానీ అపార్థాలు, చెప్పుడు మాటలు విని కాపురాలు నాశనం చేసుకోకూడదనే నేపథ్యంతో సాగిందీ కథ.

### 1.3.28 కానుక :

ఈ కథ ఈనాడు దినపత్రిక జూన్ 30, 2002న ఆదివారం అనుబంధంలో ప్రచురించబడింది. భార్యాభర్తల మధ్య ఉండే అనుబంధాన్ని ఈ కథలో తెలియజేసారు. భర్త అభిరుచుల్ని గౌరవించే భార్య దొరికితే అంతకుమించిన కానుక ఏది ఉండదన్న నేపథ్యంలో సాగిందీ కథ.

### 1.3.29 కళ్యాణ రాగం :

ఈ కథ సెప్టెంబర్ 15, 2002న ఈనాడు ఆదివారం అనుబంధంలో ప్రచురించబడింది. పెద్దలు కుదిర్చిన పెళ్ళి కలకాలం నిలవదనే అభిప్రాయం ఉండే వ్యక్తి తమ తల్లిదండ్రులు చూసిన సద్గున సంపన్నురాలైన యువతిని కాదని ప్రేమించి పెళ్ళి చేసుకోవాలని భావిస్తాడు. అతడి అభిప్రాయంవలన మంచి అమ్మాయిని కాదనుకుంటున్నాడని భావించిన అతని స్నేహితుడు అదే యువతి చేత ప్రేమ నాటకాన్ని నడిపించి వారిద్దరికి వివాహం అయ్యేలా చేస్తాడు. సమకాలీన సమాజంలో ఇటువంటి అభిప్రాయాలు యువతలో ఎక్కువగా ఉంటుంది. అది తప్పని తెలియజేసే ఉద్దేశంతో చక్కటి నేపథ్యంతో కథను నడిపించారు రచయిత్రి.

### 1.3.30 అవగాహన :

ఈ కథ ఆంధ్రభూమి వారపత్రికలో సెప్టెంబర్ 26, 2002న ప్రచురించబడింది. ఒకరినొకరు అర్థం చేసుకుంటే ఉమ్మడి కుటుంబంలో ఎటువంటి తగాదాలు రావని తెలియజేసారు. ఈ కథ ద్వారా రచయిత్రి. అన్ని అనర్థాలకు కారణం అవగాహన లోపమే. నేటి సమాజంలో ఈ అవగాహనారాహిత్యం కారణంగా అనేక కుటుంబాలు వీధిన పడుతున్నాయి. అటువంటి కుటుంబాలకు మేలుకొలుపుగా ఈ కథ సాగింది.

### 1.3.31 మాయలేడి :

ఈ కథ ఈనాడు ఆదివారం అనుబంధంలో అక్టోబర్ 20, 2002న ప్రచురించబడింది. భార్యాభర్తల మధ్య అనుమానాలకు తావివ్వరాదు. మనసువిప్పి మాట్లాడుకోవాలి. మనస్పర్థలు ఉంటే అవి అగ్నిగుండంగా మారి రెండు జీవితాలను నాశనం చేస్తుందనే సందేశంతో సాగిందీ కథ. నేటి సమాజంలో ఆలుమగలు ఒకరికొకరి మీద అపనమ్మకంతో పండంటి కాపురాలను బజారు పాలు చేస్తున్నారు. అటువంటి వారిని దృష్టిలో పెట్టుకొని ప్రబోధాత్మకంగా కథను నడిపిస్తారు రచయిత్రి.

### 1.3.32 ట్రేడ్ సీక్రెట్ :

ఈ కథ ఈనాడు ఆదివారం అనుబంధంలో 2002 డిసెంబర్ 22న ప్రచురించబడింది. ఎవరి ఇంటిపని వారు చేసుకోవడం నామోషిగా భావిస్తుంటారు. అందుకు పని మనుషులను పెట్టడం వలన శరీరానికి తగిన వ్యాయామం లేక ఊబకాయంతో

బాధపడుతుంటారు. ఎవరి ఇంటి పని వారు చేసుకుంటే ఆరోగ్యంగా, నాజూగ్గా ఉండవచ్చని తెలియజేయడమే ఈ కథ యొక్క ముఖ్య ఉద్దేశం.

### 1.3.33 అభిమాని :

ఈ కథ జయం వారపత్రికలో జనవరి 1, 2003న ప్రచురించబడింది. ఒక రచయితను అభిమానించే అభిమాని అతడిని ప్రేమించి పెళ్ళి చేసుకోవటం ఇందలి ఇతివృత్తం.

### 1.3.34 వాస్తవం :

ఈ కథ 2003 మే 11న ఈనాడు దినపత్రిక ఆదివారం అనుబంధంలో ప్రచురించబడింది. వాస్తు మీద నమ్మకంతో ఒక సగటు స్త్రీ, తన భర్తకు పెట్టిన ఇబ్బందిని చాలా చమత్కారంగా కథారూపంలో సమాజానికి అందించారు రచయిత్రి. కథ ఆద్యంతం పాఠకునికి నవ్వించేలా చేస్తుంది. మూఢనమ్మకాలను నమ్మరాదని ఒక అంతర్లీన సందేశాన్నిచ్చింది కథ.

### 1.3.35 నేను మంచి దానిని కాదు :

ఈ కథ జూలై, 2003న స్వాతి మాసపత్రికతో ప్రచురించబడింది. ఎదుటి వ్యక్తుల మనసును అర్థం చేసుకోకుండా వాళ్ళ మీద చెడు అభిప్రాయం కలిగి ఉండకూడదని ఈ కథలో తెలియజేశారు రచయిత్రి.

### 1.3.36 పేరు మారింది :

ఈ కథ ఈనాడు దినపత్రిక ఆదివారం అనుబంధంలో సెప్టెంబర్ 7, 2003న ప్రచురించబడింది. శారీరక, మానసిక ఆరోగ్యానికి విహారయాత్రలు అవసరమని ఈ యాత్రల వలన మానసికోల్లాసంతో పాటు శరీరానికి వ్యాయామం చేసినట్లవుతుందని ఈ కథ ద్వారా సమాజానికి తెలియజేసారు రచయిత్రి.

### 1.3.37 అమ్మకోరిక :

ఈ కథ స్వాతి మాసపత్రికలో 2004 జూలైలో ప్రచురించబడింది. నేటి సమాజంలో ఒకే తల్లి కడుపున పుట్టిన సంతానం ఆస్తుల కోసం తగాదాలు పడి బంధాల విలువ, బంధుత్వాల విలువ మరిచిపోతున్నవారు అధికంగా కన్పిస్తున్నారు. అటువంటి వారిలో మేలుకొలుపు కలిగే విధంగా చక్కటి నేపథ్యంలో ఈ కథను చిత్రించారు రచయిత్రి.

### 1.3.38 గాజులు తొడిగిన చెయ్యి :

ఈ కథ స్వాతి వారపత్రికలో ఆగష్టు 27, 2004న ప్రచురించబడింది. స్త్రీలను చులకనగా చూడకూడదని లాలించే గాజుల చేతులు అవసరమైనపుడు మగవాడి కంటే ధృఢంగా మారతాయని ఈ కథ ద్వారా సమాజానికి తెలియజేసే ప్రయత్నం చేసారు రచయిత్రి.

### 1.3.39 అపోహ :

ఈ కథ ఈనాడు ఆదివారం అనుబంధంలో 2005 మార్చి 6న ప్రచురించబడింది. ముఖచిత్రాన్ని చూసి పుస్తకాన్ని అంచనా వేయకూడదన్న “Don't Judge a book by its cover” అన్న సామెత ఈ కథకు నూటికి నూరుపాళ్ళు సరిపోతుంది. ఎవ్వరిని కూడా వారి మంచి దుస్తులను బట్టి వారి ప్రవర్తనను అంచనా వెయ్యరాదని ఈ కథ ద్వారా తెలియజేశారు రచయిత్రి.

### 1.3.40 రాట్నం పిలిచింది :

ఈ కథ ఈనాడు దినపత్రిక ఆదివారం అనుబంధంలో 2005 ఆగష్టు 21వ తేదిన ప్రచురించబడింది. సమాజంలో నానాటికి దిగజారిపోతున్న నైతిక విలువలను కాపాడాలనే నిశ్చయంతో రచయిత్రి ఈ కథను రాశారు.

### 1.3.41 విజ్ఞాపన :

ఈ కథ ఈనాడు దినపత్రిక ఆదివారం అనుబంధంలో 2006 మే 14న ప్రచురించబడింది. స్త్రీ జాతి యొక్క ఔన్నత్యాన్ని తెలియజేసే నేపథ్యంలో సాగిందీ కథ.

### 1.3.42 మోహన గీతం :

ఈ కథ స్వాతి వారపత్రికలో 2007 మార్చి 30న ప్రచురించబడింది. చక్కటి చమత్కారంతో నేటితరం ఇంగ్లీషుమీడియం చదువులు తెలుగు భాషను ఏవిధంగా మర్చిపోతున్నారో ఈ కథలో చిత్రించారు రచయిత్రి.

### 1.3.43 గాయం :

ఈ కథ ఈనాడు దినపత్రిక ఆదివారం అనుబంధంలో 2007 మే 27న ప్రచురించబడింది. శరీర సంబంధమైన గాయం కంటే మనసుకు తగిలిన గాయం మరింత బాధను కలిగిస్తుందని ఈ కథ ద్వారా సమాజానికి తెలియజేసారు రచయిత్రి.

### 1.3.44 షాక్ ట్రీట్‌మెంట్ :

ఈ కథ స్వాతి మాసపత్రికలో 2007 ఆగష్టులో ప్రచురించబడింది. వసుధైక కుటుంబభావన సమాజంలో అందరూ కలిగి ఉండాలనే నేపథ్యంతో సాగిందీ కథ.

### 1.3.45 ఖజానా :

ఈ కథ ఈనాడు దినపత్రిక 2008 జనవరి 20న ఆదివారం అనుబంధంలో ప్రచురించబడింది. జీవితంలో కష్ట సమయాల్లో కూడా భవిష్యత్ పట్ల ఆశా దృక్పథంతో నిరాశ నిస్పృహలకు లోనుకాకుండా ఉండాలన్న నేపథ్యంతో సాగిందీ కథ. చక్కటి కథనంతో కథను మలిచారు రచయిత్రి.

### 1.3.46 చుక్కమ్మ :

ఈ కథ ఈనాడు దినపత్రిక 2008 జూన్ 29న ఆదివారం అనుబంధంలో ప్రచురించబడింది. మనుషులమధ్య బంధాలు, బంధుత్వాలు నానాటికి డబ్బుతో ముడిపడిపోతున్నాయి. సమకాలీన సమాజంలో మానవీయ విలువలు అంతరించి పోతున్నాయి. ఈ కథద్వారా వాటిని తట్టి లేపే ప్రయత్నం చేశారు రచయిత్రి.

### 1.3.47 పుడమి పులకించింది :

ఈ కథ రచన మాసపత్రికలో నవంబర్, 2008న ప్రచురించపబడింది. ఎదుటి మనిషి మీద పగను పెంచుకోవడం కంటే, ప్రేమను పెంచుకోవడంలోనే అసలైన ఆనందం ఉంటుందని ఈ కథ ద్వారా తెలియజేశారు రచయిత్రి.

### 1.3.48 కీడెంచి :

ఈ కథ ఈనాడు ఆదివారం అనుబంధంలో ఏప్రిల్ 12, 2009న ప్రచురించబడింది. స్త్రీలకు సంబంధించి సహజసిద్ధమైన ఈర్ష్య అసూయలను ఒక పాత్రలో చూపిస్తూ అటువంటి భావజాలం మంచిది కాదని మరో పాత్రద్వారా రచయిత్రి ఈ కథలో తెలియజేసారు.

### 1.3.49 మొగలిపువ్వు :

ఈ కథ రచన మాసపత్రికలో ఏప్రిల్, 2009న ప్రచురించబడింది. ఆలూమగల బాంధవ్యం గురించి ఈ కథలో తనదైన శైలిలో రచయిత్రి అద్భుతంగా చిత్రించారు.

**1.3.50 ఎదురుదాడి :**

ఈ కథ నది మాసపత్రిక ఫిబ్రవరి 2010లో ప్రచురించబడింది. పాఠాలకు సంబంధించిన ఒత్తిడిని తగ్గించేలా ఆటపాటలు ఉండాలని, పిల్లల్లో మరింత ఒత్తిడిని పెంచేలా తల్లిదండ్రులు ప్రవర్తించకూడదని ఈ కథ ద్వారా సమాజానికి తెలియజేశారు రచయిత్రి.

**1.3.51 తెలివి తేటలు :**

ఈ కథ నది మాసపత్రికలో 2010 మార్చి సంచికలో ప్రచురించబడింది. పోస్టుకార్డులో పట్టేంత పరిమిత పదాలతో కథను రాయడం, కథలో రచయిత్రి చెప్పాలనుకున్న విషయాన్ని సూటిగా చెప్పగలగడం ఆమె ప్రతిభకు నిదర్శనం.

**1.3.52 బోధివృక్షం నీడలో :**

ఈ కథ ఈనాడు దినపత్రిక ఆదివారం అనుబంధంలో 2010 జూన్ 13న ప్రచురించబడింది. సిరిసంపదల కంటే మనిషికి నలుగురి తోడే ఎక్కువ సంతృప్తినిస్తుందనే నేపథ్యంతో సాగిందీ కథ.

**1.3.53 ఎదురు చూపు :**

ఈ కథ ఆంధ్రజ్యోతి దినపత్రిక ఆదివారం అనుబంధంలో 2010 జూలై 25న ప్రచురించబడింది. ఆధునిక పోకడలతో వ్యక్తిగత స్వేచ్ఛ పేరుతో పిల్లలు ఏ మార్గాన పోతున్నారో పట్టించుకోని తల్లిదండ్రులనుద్దేశిస్తూ రాసిందే ఈ కథ.

**1.3.54 పాలవెల్లి :**

ఈ కథ నవ్యవారపత్రికలో 2010 ఆగష్టు 14న ప్రచురించబడింది. కుటుంబంలోని వ్యక్తుల మధ్య దాపరికాలు లేకుండా తేటతెల్లంగా ఉంటే అటువంటి కుటుంబాల్లో ఎటువంటి సమస్యలు తలెత్తవని రచయిత్రి ఈ కథలో తెలియజేసారు.

**1.3.55 ప్రేమతో :**

ఈ కథ ఈనాడు దినపత్రిక ఆదివారం అనుబంధంలో 2011 జనవరి 30న ప్రచురించబడింది. తన ఆదర్శాల కోసం భర్తను, కన్న బిడ్డను వదిలి ఒంటరిగా జీవించిన స్త్రీ మూర్తి కథ. ఒక విలక్షణమైన కథనంతో పాఠకుని హృదయాన్ని ఆకట్టుకున్నారు రచయిత్రి.

**1.3.56 విమల – ఆనందరావు :**

ఈ కథ నవ్య వారపత్రికలో 2012 మార్చి 14న ప్రచురించబడింది. చక్కటి హాస్యంతో కథను ఎంతో చక్కగా నడిపించారు రచయిత్రి.

**1.3.57 ఎడారిలో వసంతం :**

ఈ కథ నవ్య వారపత్రికలో 2012 మే 9న ప్రచురించబడింది. అందవిహీనంగా ఉన్నందుకు సమాజంలోని నలుగురు నాలుగుమాటలు అనడంవలన సమాజాన్నే బహిష్కరించాలనుకుంటున్న స్త్రీమూర్తిని తనలోని అంతర్గత శక్తుల గూర్చి వివరించి ఆదర్శవంతమైన జీవనాన్ని జీవించేలా చేసే ఆదర్శ పురుషుని కథ ఇది.

**1.3.58 విలువలు :**

ఈ కథ స్వాతి మాసపత్రికలో మే 2012న ప్రచురించబడింది. ధనవ్యామోహంతో నానాటికి అంతరించిపోతున్న మానవీయ విలువలను ఈ కథ ద్వారా తట్టి లేపారు రచయిత్రి.

**1.3.59 దెయ్యం కథ :**

ఈ కథ ఆంధ్రభూమి దినపత్రిక ఆదివారం అనుబంధంలో 2012 అక్టోబర్ 14న ప్రచురించబడింది. స్వార్థం, చెడు వ్యసనాలు మనుషులను పీడించే అసలైన దెయ్యాలని రచయిత్రి ఈ కథలో తెలియజేశారు.

**1.3.60 ఇద్దరు... ఏకవచనం :**

ఈ కథ నవ్య వారపత్రికలో 2013 జూన్ 5న ప్రచురించబడింది. భార్య, భర్తల అనుబంధాన్ని గూర్చి తెలియజేసారు. ఈ కథలో రచయిత్రి, స్త్రీ, పురుషుల మధ్య వైవాహిక సంబంధం వారిద్దరి మధ్య ఎటువంటి బంధాన్ని ఏర్పరుస్తుందో తనదైన శైలిలో చిత్రించారు.

**1.3.61 ముందుచూపు :**

ఈ కథ ఆంధ్రభూమి వారపత్రికలో 2013 సెప్టెంబర్ 12న ప్రచురించబడింది. దగ్గరగా ఉండి దూరమైపోయేకంటే దూరంగా ఉండి దగ్గరవ్వటమే మంచిదనే నేపథ్యంతో సాగిందీ కథ.

### 1.3.62 అత్తగారు – కొత్త కోడలు :

ఈ కథ స్వాతి వారపత్రికలో జనవరి 10, 2014న ప్రచురించబడింది. అత్తా, కోడళ్ళు ఒకరిపై ఒకరు ఛలోక్తులు వేసుకుంటూ చక్కటి వ్యంగ్యంతో కూడిన హాస్యంతో సాగిందీ కథ. రచయిత్రి రచనా వైదుష్యానికి మచ్చుతునక ఈ కథ.

### 1.3.63 పై చేయి :

ఈ కథ నది మాసపత్రికలో జనవరి, 2014న ప్రచురించబడింది. ఇతరులకు పంచడంలో ఉన్న తృప్తి, తీసుకోవడంలో ఉండదని ఈ కథ ద్వారా సమాజానికి తెలియజేశారు రచయిత్రి.

### 1.3.64 స్నేహం :

ఈ కథ ఈనాడు దినపత్రిక ఆదివారం అనుబంధంలో 2014 ఆగష్టు 3న ప్రచురించబడింది. ఇద్దరు ప్రాణ స్నేహితుల మధ్య ఉండే ఆత్మీయ అనుబంధాన్ని చక్కటి కథగా మలిచారు రచయిత్రి.

### 1.3.65 ఇంటర్వ్యూ :

ఈ కథ నవ్య వారపత్రికలో 2014 సెప్టెంబరు 17న ప్రచురించబడింది. ఆదర్శవంతమైన జీవితాన్ని గడిపితే నలుగురికి ఆదర్శప్రాయంగా మారుతామని, అటువంటి జీవిత విధానం ఎల్లప్పుడూ మేలు చేస్తుందే గాని కీడుచేయదని ఈ కథ యొక్క ప్రధాన ఉద్ధేశ్యం. రచయిత్రి సమాజంలో మార్పుని కాంక్షించి ఈ కథ రాశారనిపిస్తుంది.

### 1.3.66 షాక్ :

ఈ కథ విపుల మాస పత్రికలో అక్టోబర్, 2014న ప్రచురించబడింది. డబ్బు కంటే నైతిక విలువలు ముఖ్యమని తెలియజేసే నేపథ్యంతో సాగిందీ కథ.

### 1.3.67 అనుబంధం :

ఈ కథ ఈనాడు దినపత్రిక ఆదివారం అనుబంధంలో 2017వ ఫిబ్రవరి 12వ తేదీన ప్రచురించబడింది. ఆర్థిక లావాదేవీల కంటే ఆత్మీయతానుబంధాలకు విలువనిచ్చేవారే నిజమైన ఐశ్వర్యవంతులు అనే నేపథ్యంతో సాగిందీ కథ.

### 1.3.68 ఎందుకు... నీకెందుకూ :

ఈ కథ 2017 ఫిబ్రవరి 22వ తేదీన నవ్య వారపత్రికలో ప్రచురించబడింది. అన్యాయాన్ని ప్రశ్నించగల పౌర లక్షణమే మంచి సమాజాన్ని సృష్టించగలదు అన్న సందేశంతో సాగిందీ కథ.

### 1.3.69 నాన్నకి ప్రేమతో :

ఈ కథ స్వాతి మాసపత్రికలో 2017వ సంవత్సరం మే నెలలో ప్రచురించబడింది. ఎదిగిన పిల్లలు కుటుంబ సమస్యలను అర్థం చేసుకుని బాధ్యతతో వాటిని నెరవేర్చే ప్రయత్నం చేయడమే తల్లిదండ్రులకు వారు ఇవ్వగలిగే విలువైన కానుక అన్న సందేశంతో సాగిందీ ఈ కథ.

### 1.3.70 అరుగుల బడి :

ఈ కథ నవ్య వారపత్రికలో 2017వ సంవత్సరం నవంబర్ నెల 22వ తారీఖున వెలువడిన సంచికలో ప్రచురించబడింది. విద్యార్థుల మనసులలో నైతిక విలువల విత్తనాలను సమర్థవంతంగా నాటగలిగే గురువులు ఆరోగ్యవంతమైన రేపటి సమాజ నిర్మాణానికి పరోక్షంగా కారకులు అవుతారన్న నేపథ్యంతో సాగిందీ కథ.

### 1.3.71 పిచ్చుక గూడు :

ఈ కథ నవ్య వారపత్రికలో 2018వ సంవత్సరం ఆగష్టు నెల 15వ తారీఖున వెలువడిన సంచికలో ప్రచురించబడింది. సంతృప్తి అనే తరువుకే సంతోష సుమాలు విరబూస్తాయి. సంతృప్తీ, సాధనా బ్రతుకుబండికి జోడు గుర్రాలైతే, ఆనందం, అభివృద్ధి కూడా స్వాంతమవుతాయి అన్న సందేశంతో సాగిందీ కథ.

### 1.3.72 బంధుత్వం :

ఈ కథ ఈనాడు ఆదివారం అనుబంధంలో 2018వ సంవత్సరం నవంబరు నెల 25వ తారీఖున ప్రచురించబడింది. కృతజ్ఞత చూపించడం మంచి లక్షణాల్ని అలవర్చుకోవడం తల్లిదండ్రుల నుంచే ప్రారంభించాలనే సందేశంతో సాగిందీ కథ.

### 1.3.73 మలిసంజె వేళలో :

ఈ కథ ఈనాడు ఆదివారం అనుబంధంలో 2019వ సంవత్సరం జనవరి నెల 27వ తారీఖున ప్రచురించబడింది. విహార వినోదాలతో పాటు ఇంటి బాధ్యతలలోను తోడునీడగా ఉండే దంపతులకు మలి వయసు ఆహ్లాదకరంగానే ఉంటుందన్న నేపథ్యంతో సాగిందీ కథ.

### 1.3.74 ధీర :

ఈ కథ ఉషోదయ వెలుగు ఆధ్యాత్మిక మాసపత్రికలో 2019వ సంవత్సరం జనవరి–ఫిబ్రవరి నెలల్లో ప్రచురించబడింది. సాహసంతో ముందడుగు వేస్తే విజయం సాధించవచ్చుననే నేపథ్యంతో సాగిందీ కథ.

### 1.3.75 దాడి :

ఈ కథ 2019వ సంవత్సరం ఏప్రిల్ నెల 24వ తేదీన వెలువడిన నవ్య వారపత్రికలో ప్రచురించబడింది. ఆత్మీయతతో మనసులను గెలుచుకోగలగడమే అసలైన బలం. కేవలం అధికారమే చూపించేవారిపై అవకాశం లభించినప్పుడు అణకువగా ఉండే అమాయకులలోను తిరుగుబాటుతనం బయటకు వస్తుందన్న నేపథ్యంతో సాగిందీకథ.

### 1.3.76 పున్నమి వెలుగు :

ఈ కథ ఈనాడు ఆదివారం అనుబంధంలో 2019వ సంవత్సరం సెప్టెంబర్ నెల 15వ తారీఖున ప్రచురించబడింది. తమ నడవడి ద్వారా పిల్లలకు మంచి దారి చూపించగల తల్లిదండ్రులే ప్రతిభావంతులైన ఉత్తమ గురువలన్న సందేశంతో సాగిందీకథ.

### 1.3.77 ఇరుగు పొరుగు :

ఈ కథ 2019వ సంవత్సరం సెప్టెంబర్ నెల 29న ఈనాడు ఆదివారం అనుబంధంలో ప్రచురించబడింది. అవసరమైన ఆచారాలను అవలంభిస్తూ ఇబ్బందులు పాలవ్వడం కంటే అటువంటి ఆచారాలకు దూరంగా ఉండటమే మంచిదనే నేపథ్యంతో సాగిందీకథ.

**1.3.78 పండగొచ్చింది :**

ఈ కథ ఉషోదయ వెలుగు ఆధ్యాత్మిక మాసపత్రికలో 2019వ సంవత్సరం నవంబర్, డిసెంబర్ నెలలలో ప్రచురించబడింది. తొందరబడి విడాకులు తీసుకోవడంకన్నా ముఖాముఖి చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించుకుంటే బాగుంటుందనే నేపథ్యంతో సాగిందీకథ.

**1.3.79 నామకరణం :**

ఈ కథ ఆంధ్రభూమి ఆదివారం అనుబంధంలో 2020వ సంవత్సరం ఫిబ్రవరి నెల 2వ తారీఖున ప్రచురించబడింది. మన ఆలోచన విధానం కొంచెం మార్చుకుంటే కొన్ని సమస్యలు ఇట్టే సమసిపోతాయి అనే సందేశంతో సాగిందీకథ.

## 1.4 నవలా రచయిత్రిగా :

శ్రీ గోగినేని మణి కథా రచయిత్రిగానే కాక నవలా రచయిత్రిగా కూడా తనదైన ముద్ర వేసుకున్నారు. "సుజన" అనే శీర్షికతో ఒక చక్కటి నవలను రాశారు. ఈ నవల నవ్య వారపత్రికలో "కలవారి కోడలు" పేరుతో సీరియల్‌గా ప్రచురించబడి బహుజన పాఠకాదరణ పొందింది.

## 1.5 ప్రముఖుల అభిప్రాయాలు :

**శ్రీ ముళ్ళపూడి వెంకటరమణ :**

ఈమె కథలను చదివినపుడు ఆత్మీయులతో కలిసి అందమైన పూలతోటలో విహరించిన ఆనందమూ, కమ్మని రుచుల విందు భోజనం చేసిన సంతృప్తీ కలుగుతాయి.

**శ్రీ యండమూరి వీరేంద్రనాథ్ :**

ఆహ్లాదపు అనుభూతి పిండిలో, సామాజిక రుగ్మత చేదు వాస్తవపుటుప్పు కలిపి, పరిశీలనతో తడిపి, సెటైర్ నూనెలో వేయించి, హాస్యం పాకంలో నానబెట్టిన ఈ వంటకాన్ని ఆసాంతమూ ఆస్వాదిస్తే గాని అందులో రుచి తెలియదు.

**శ్రీ మల్లాది వెంకట కృష్ణమూర్తి :**

ఏ రచనకైనా ప్రధానంగా ఉండాల్సిన గుణం పాఠకుల చేత చదివించగలగడం. చక్కటి శైలి ఇందుకు తోడ్పడుతుంది. ఓ ప్రవాహంలా పదాల పొందిక సాగడమే చక్కటి

శైలి యొక్క ముఖ్య లక్షణం. ఇది గోగినేని మణిగారి కథల్లో ఉంది. పాఠకుల్ని అయోమయంలో ఉంచకుండా చక్కగా, సూటిగా చెప్పగలిగే సమర్ధతగల మణిగారి కథలు... విలువైన మణులే.

సమకాలీన జీవితాన్ని వివిధ కోణాల్లో పరిశీలించే నేర్పు, సమస్యల్ని కథా వస్తువులుగా ఆవిష్కరించే సత్తా కూడా గోగినేని వారికి ఉందని ఈమె కథల్ని చదివితే అర్ధమవుతుంది. ఎత్తుగడ, ముగింపు, శిల్పం, పాత్ర చిత్రణ, సంఘటన, సన్నివేశాలు లాంటివన్నీ పకడ్బందీగా బిగించి రచనలు చేసిన రచయిత్రి గోగినేని మణి.

### శ్రీ గిడుగు రాజేశ్వరరావు :

షడ్రసోపేతంగా వడ్డించిన విస్తరిలాంటి దాంపత్యం పొరపాటున కొనలో చిరిగిపోతే ఒకరినొకరు తప్పుపట్టి విస్తరంతా చింపి నేల పాలు చేసుకోకుండా సానుకూల దృక్పథంతో సవరించుకోవచ్చని చెప్పడం. "మొగలి పువ్వు" కథలో చాలా నేర్పుగా, చమత్కారంగా, విలక్షణంగా సాగింది. ఉత్కంఠతో చదివించగలగడం సంభాషణలను హాయిగా సాగించడం గోగినేని మణిలో మెచ్చుకోతగ్గ విషయాలు.

### నవ్య వారపత్రిక :

ఆహ్లాదభరితమైన కథలు, చక్కటి శైలి, హాయిగా సాగిపోయే కథనం, ఆహ్లాదకరమైన వాతావరణం, హాస్య చతురత.... ఒక మంచి రచనకు కావలసిన లక్షణాలు ఇవే అయితే వాటన్నింటిలోనూ తనకు పట్టున్నదని రచయిత్రి (గోగినేని మణి) నిరూపించుకున్నారు.

### శ్రీపంతుల జోగారావు :

ఒక సానుకూలపు దృక్పథంలో జీవిత వాస్తవాలను భిన్నకోణాల నుండి పరిశీలిస్తూ, హాయిగా చదివించే శైలిలో, సున్నితమైన హాస్య చమక్కులతో విలక్షణంగా సాగే వీరి కథలు ఇట్టే ఆకట్టుకుంటాయి. స్వచ్ఛమైన సామాజిక, కౌటుంబిక వాతావరణాన్నే కోరుకునే కథలు గోగినేని మణి కథలు.

### శ్రీ ప్రతాప రవిశంకర్ :

కథలకు జీవితమే ప్రేరణ. జీవితం నుంచీ కథలు పుట్టుకొస్తాయి. జీవితాన్ని వివిధ కోణాలు నుండి పరిశీలించినప్పుడు మంచి కథలు బయటకు వస్తాయి. ఏ రచయితకైనా

అబ్జర్వేషన్ ముఖ్యం. అబ్జర్వేషన్ లేకుండా రాసే కథల్లో జీవితం గుర్తించబడదు. గోగినేనిమణిగారు రాసిన కథలు మంచి కథలుగా అనిపిస్తాయి. ఎందుకంటే ఈ కథల్లో అడుగడుగునా జీవితం కనబడుతూ ఉంటుంది.

**రచన మాసపత్రిక :**

గంగ, యమున, కృష్ణ, గోదావరి వగైరా నదులన్నీ జలప్రవాహాలే. అయినా ప్రతి నదీ జలానికి ఓ ప్రత్యేకత ఉంది. రచయితలందరూ కథలే వ్రాసినా ఎవరి ప్రత్యేకత వారిది. సంభాషణా చాతుర్యం, లోతైన విశ్లేషణ, హాస్యం వగైరాలలో తనదైన ప్రత్యేకతను సంతరించే విధంగా చేసుకున్న రచయిత్రి గోగినేని మణి.

**వసుంధర :**

సంభాషణ చాతుర్యం, లోతైన విశ్లేషణ, హాస్యం వగైరాలలో ప్రత్యేకతను సంతరించుకున్న 'తొలిచూపు' మహామహుల రచనల సరసన నిలిచే గొప్ప కథా సంకలనం ప్రతీ కథా చక్కని సందేశాన్నిచ్చేదే. పేజీలు తిరగేస్తే సత్కాలక్షేపం, ఆలోచిస్తే ఉపనిషత్తుల సారం.

## 1.6 అవార్డులు – రివార్డులు :

1) 1988 నవంబర్ 4న ఆంధ్రపత్రిక (వారరపత్రిక)లో ప్రచురించబడిన "నిప్పులేని పొగ" కథకు దీపావళి కథల పోటీలో బహుమతి పొందారు.

2) 2001 జనవరి 26న స్వాతి వారపత్రికలో ప్రచురించబడిన "నైన్... ఒన్...ఒన్ కథకు ప్రథమ బహుమతి లభించింది.

3) ఈనాడు దినపత్రిక ఆదివారం సంచిక 2008 జూన్ 29న ప్రచురించబడిన "చుక్కమ్మ" కథకు ప్రత్యేక బహుమతి లభించింది.

4) రచన మాసపత్రిక 2008 నవంబర్‌లో ప్రచురించబడిన "పుడమి పులకించింది". కథకు కథాపీఠం పురస్కారం లభించింది.

5) ఏప్రిల్ నెల, 2009 సంవత్సరంలో రచన మాస పత్రికలో ప్రచురించబడిన "మొగలిపువ్వు" కథకు ప్రసిద్ధ రచయిత గిడుగు రాజేశ్వరరావు గారి ప్రశంసలతో పాటు నగదు బహుమతిని పొందింది.

6) ఆంధ్రజ్యోతి ఆదివారం సంచిక 2010 జూలై 25న ప్రచురించబడిన "ఎదురు చూపు" కథకు కథా వసంతం కథల పోటీలో బహుమతి లభించింది.

7) పిచ్చుకగూడు కథ బలివాడ కాంతారావు స్మారక కథల పోటీలో ఆంధ్రజ్యోతి వారి నవ్య వీక్లి ద్వారా బహుమతి పొందింది.

**ముగింపు :**

గోగినేనిమణి గారు తెలుగు సాహిత్య చరిత్రలో 79 కథలను, ఒక నవలను రాసి తనకంటూ ఒక ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకోగలిగారు. వీరి కథల్లో చక్కని వర్ణన, సంభాషణా శైలి, వస్తు వైవిధ్యం అడుగడుగునా కన్పిస్తుంది. వీరి కథలు సహజ రీతిని, సమాజ నీతిని తెలియజేసే విధంగా ఉండి, దానిలోని వస్తువు అందరినీ ఆకర్షించే విధంగా ఉంటుందని తెలుస్తుంది. లోకం పోకడ బాగా తెలిసిన రచయిత్రి గోగినేని మణి. వీరి రచనల్లో చాలావరకు సామాజిక చిత్రణతో పాటు సమాజంలో ఉన్న అనేక మంది మనస్తత్వాలను వస్తువుగా చేసుకుని మన చుట్టూ ఉన్న వ్యక్తుల భావి జీవితాన్ని ఆలోచనగా చేసుకుని వచ్చినవే.

గోగినేని మణి కథల్లో చక్కని కొసమెరుపు ఉంటుంది. సూక్తులు, లోకోక్తులు వాటితో పాటు కొన్ని కొత్త సామెతలు సృష్టించి కొత్త నిర్వచనాలను ఇస్తూ కథను నడిపించడం ఈమెకే చెల్లింది. ఈమె కథలు చాలా వరకు సందేశాత్మకంగానూ, ఆలోచనాత్మకంగా ఉంటాయి. అక్కడక్కడ శృంగార వర్ణనలు కొద్దిగా హృదయోల్లాసాన్ని కల్గిస్తూ చల్లని పెరటి గాలిలా, వెచ్చని పడుచు గాలిలా పాఠకుడి చుట్టూ తిరిగి కథలో కలిసిపోతాయి. ఈ కథల యొక్క వస్తువును బట్టి అనేక విధాలుగా విభజించవచ్చు. అటువంటి కథల్లో ఉన్న వస్తువును బట్టి విభజించి రెండవ అధ్యాయంలో విశ్లేషించడమైనది.